ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 27 నవంబరు 2025 | 5




పవన్..అభివాదం
బహిరంగ సభలో పవన్ అభివాదం.. పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్


ఎ.వేమవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


ఆలయం ఎదుట బారులు తీరిన భక్తులు


ఆలయంలో చిన్నారులతో కలెక్టర్ సతీమణి నివేదిత

ఘనంగా షష్ఠి వేడుకలు

- సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు
- తెల్లవారుజామునే ఆలయాలకు బారులు

అమలాపురం టౌన్/రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునుంచి భక్తులు ఆలయానికి బారులు తీరారు. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలను భక్తి,శ్రద్ధలతో తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమలాపురంలో శ్రీకృష్ణేశ్వర స్వామిఆలయం,బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యుని కల్యాణాలు నిర్వహించారు. గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో చింతా అత్తిలింగం-వీరభద్రమణి సోదరుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో చింతా శంకరమూర్తి -చంద్రకళ దంపతులతోపాటు వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. కృష్ణేశ్వర స్వామి ఆలయంలో కార్యనిర్వహణాధికారి ఆర్.శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ ఏలూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారికల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. కృష్ణేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ మహేష్‌కుమార్, సతీమణి నివేదిత, పిల్లలతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో వారికి వేదాశీర్వచనం అందజేసి సత్కరించారు. ఎ.వేమవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిఆలయంవద్ద దేవస్థానం చైర్మన్ కొంపెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజల అనంతరం స్వామివారి దర్శన సదుపాయం భక్తులకు కల్పించారు.


ద్రాక్షారామలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకం

మీ కోసమే వచ్చామయ్యా : రాజోలు నియోజకవర్గం శివకోడులో బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం



జన..పవనాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పవన్ వచ్చారు.. హామీలిచ్చారు.. మీకు అండగా నేనున్నా.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానంటూ భరోసానిచ్చారు.. ఏపీ డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారిగా రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన పవన్‌కల్యాణ్‌కు జనం అడుగడుగునా నీరాజనం పలికారు. మలికిపురం మండలం గూడపల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు బుధవారం ఉదయం 10.30 గంటలకు చేరుకున్న ఆయన తిరిగి శివకోడులో బహిరంగ ముగించుకుని నాలుగు గంటల అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు హెలికాప్టర్‌లో అమరావతి పయనమై వెళ్లారు. గూడపల్లిలో హెలికాప్టర్ దిగిన తరువాత కేశనపల్లి వంతెన పై నుంచి ఉప్పునీటితో చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలించి గంటన్నర సేపు రైతులతో ముఖాముఖిగా ముచ్చటించారు. శంకరగుప్తం డ్రెయిన్ మూలాలను అడిగి తెలుసుకుని 45 రోజుల వ్యవధిలో ప్రణాళికలు రూపొందించి కొబ్బరి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని స్పష్టత ఇచ్చారు. అనంతరం అక్కడి నుంచి రాజోలు మండలం శివకోడుకు వచ్చే ప్రాంతంలో ఎన్నో సమస్యలు గుర్తించారు. కూనవరంలో శిథిల శివాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. పల్లెపండుగ 2.0 ప్రారంభంతో పాటు కోనసీమలో రహదారుల అభివృద్ధికి అదనంగా రూ.100 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే వాడపల్లి ఆలయానికి వెళ్లే ఏటిగట్టు రోడ్డు అభివృద్ధికి రూ.6 కోట్లు విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఓఎన్జీసీ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా..కోనసీమలో రైల్వేలైన్ ఏర్పాటు ఆవశ్యకతను ప్రస్తావించారు. శివకోడుసభలో 1:15 గంటల పాటు పవన్ ప్రసంగం ఆకట్టుకుంది. పవన్ ప్రసంగం సమయంలో అభిమానులు కేరింతలు, హర్షధ్వానాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది.

అడుగడుగునా నీరాజనం

- 4 గంటల పాటు పర్యటన
- అభిమానుల ఎదురుచూపులు
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కొబ్బరి రైతుల బాధ్యత నాది..

కొబ్బరి రైతులెవరూ రోడ్డెక్కకుండా కాపాడే బాధ్యత నాది అంటూ భరోసా ఇచ్చారు. కేరళ తరహా ప్రకృతి అందాలతో అలరారే కోనసీమలో బ్యాక్ వాటర్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. సినిమా షూటింగ్‌లకు అనువైన పరిస్థితులున్నాయి.కొబ్బరి రైతులకు కోకోనట్ బోర్డు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.



నాటి చిరు దీపమే.. నేడు కీలకం..

2019 ఎన్నికల్లో నేను ఓడిపోయాను. రాజోలు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిని గెలిపించి చీకట్లో ఒక చిరుదీపాన్ని వెలిగించారు. కానీ ఆ ఎమ్మెల్యే వేరే పంచకు చేరారు. ఆనాటి చిరు దీపమే ఈ రోజు కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలకమైందని పవన్ ప్రస్తావించారు.






నిధులు..వరదలా..

రాష్ట్రంలో రూ.6,787 కోట్ల అంచనాతో పల్లెపండుగ కార్యక్రమం చేపడుతున్నాం. రూ.5,838 కోట్ల అంచనాతో 8,571 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నాం. రూ.4 కోట్లతో 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. పంచాయతీల పరిధిలో రూ.406 కోట్లతో 15 వేల కొత్త అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రూ.148 కోట్లతో డీపీఆర్సీ, పంచాయతీ భవనాలు నిర్మిస్తాం'. కోనసీమకు అదనంగా రూ.100 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రెయిన్లు, పంట కాల్వల ఆధునికీకరణకు రూ.4 వేల కోట్లు అవసరం.




యువతుల కేరింత.. తుళ్లింత


శివకోడు సభలో ప్రసంగిస్తున్న పవన్ చిత్రంలో ఎంపీ హరీష్, ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, దేవవరప్రసాద్, అయితాబత్తుల, గిడ్డి సత్యనారాయణ


మేం వీరమహిళలం: జనసేన ఎంబ్లమ్‌తో మహిళల ఉత్సాహం



ప్లకార్డులతో కూటమి ద్వయం


డిప్యూటీ సీఎం పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు


పవన్‌కు వాడపల్లి వెంకన్న చిత్రపటం, స్వామివారి ప్రసాదం అందజేస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు


హెలీప్యాడ్ వద్ద డిప్యూటీ సీఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజోలు టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య



రాజోలు మండలం శివకోడులో పల్లెపండుగ ఫ్లెక్సీలతో నిండిన సభా ప్రాంగణం

గోదావరి నదీపాయకు తాత్కాలిక రహదారి ఏర్పాటు

- గంటిపెదపూడి లంక గ్రామాలనుంచి బూరుగులంక నదీపాయ వద్దకు నిర్మించుకుంటున్న లంక గ్రామాల ప్రజలు

పి.గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన ఆ నాలుగు లంక గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. గోదావరిలో వరద ఉధృతి తగ్గడంతో ఆ నదీపాయలో పడవలు రాకపోకలు సాగించే సామర్థ్యం లేకపోవడంతో లంక గ్రామస్తులు కొన్నిరోజులుగా నీటిలో కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. ఈక్రమంలో ఏటా మాదిరిగానే గంటిపెదపూడి శివారు బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఊడిమూడిలంక గ్రామాల ప్రజలు రెండురోజులుగా రెండు ఎక్స్‌కవేటర్ల సాయంతో బూరుగులంక నదీపాయకు తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో మళ్లీ గోదావరికి వరదలు వచ్చేవరకు ఈ తాత్కాలిక రహదారిపైనే ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. వ్యవసాయ ఉత్పత్తులను సైతం వాహనాల ద్వారా ఇవతలి ఒడ్డుకు తరలించుకుంటారు. ఏఐబీ నిధులు రూ.71.43కోట్లతో బూరుగులంక నదిపాయ పై జరుగుతున్న వంతెన నిర్మాణపు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రధాన వంతెనకు అనుసంధానంగా ప్రధాన పంట కాల్వపై నిర్మించే వంతెన పనులు పూర్తయ్యాయి. ఏటిగట్టు దిగువన గోదావరిపై నిర్మితమవుతున్న ప్రధాన వంతెన నిర్మాణపు పనులు మాత్రం ప్రికెస్ట్ గెడ్డర్ పనులు జరుగుతున్నాయి. కాగా పలుమార్లు ఏఐబీ ప్రతినిధులు వంతెన నిర్మాణపు పనులు పరిశీలించి వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి ఈవంతెనను లంక గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. వంతెన అందుబాటులోకి వస్తే వారికి తిప్పలు తప్పనున్నాయి.


పి.గన్నవరం మండలం గంటిపెదపూడి శివారు బూరుగులంక వద్ద నదీపాయపై ఎక్స్‌కవేటర్ల సాయంతో తాత్కాలిక రహదారి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రపంచ దేశాలకు అతిగొప్ప రాజ్యాంగం మనదే: డీఈవో


పేరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న డీఈవో సలీంబాషా

అమలాపురంరూరల్/టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాల్లో అతిగొప్ప రాజ్యాంగం మనదేనని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి అన్నారు. తొలుత అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి సలీంబాషా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేరూరు, వన్నెచింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పేరూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ భారత రాజ్యాంగం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కొంకాపల్లిలో సాంఘిక సంక్షేమశాఖ బాలుర-2 వసతిగృహంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను విద్యార్థి దశనుంచి తెలియచేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఎస్సీ ఎస్టీ జిల్లాశాఖ మోనటరింగ్ కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజనీ, సర్పంచ్ దాసరి అరుణడేవిడ్, దేవరపల్లి వీరేష్‌కుమార్, ముత్తాబత్తుల నారాయణ, శ్రీనివాస్, హెచ్‌ఎంలు కాశి సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.





తుఫాన్ కలవరం.. రైతుల్లో ఆందోళన

తుఫాన్ నేపథ్యంలో రాజోలు వద్ద హైవేపై ఆరబెట్టిన ధాన్యాన్ని సంచుల్లోకి సర్దుకుంటున్న రైతులు

'తూర్పు'లో మండపేట నియోజకవర్గం విలీనంపై.. హర్షాతిరేకాలు

రాయవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలిపేందుకు నిర్ణయించడంపై కూటమి నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాయవరం మండలం వి.సావరం గ్రామంలో వెదురుపాక సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ పిల్లి గణేష్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్స్ పంచిపెట్టారు. సోమేశ్వరంలో కూటమి నాయకులు ఎస్.శ్రీనివాస్, శాకా కోటేశ్వరరావు, శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించడంతోపాటు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల సాయిబాబు, యండూరి వెంకటరమణ, కనకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు కూటమి నేతల పాలాభిషేకం


రాయవరం మండలం సోమేశ్వరంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

సమస్యలన్నీ తీరుస్తా..



ఇన్ని సమస్యలా : మలికిపురం మండలం కేశనపల్లిలో ఫొటో ఎగ్జిబిషన్‌లో సమస్యలు చూసి ఆవేదన చెందుతున్న పవన్, చిత్రంలో ఎంపీ, కలెక్టర్ తదితరులు

- కోనసీమ పర్యటనలో పవన్
- రైతాంగ సమస్యలపై అధ్యయనం
- శాశ్వత పరిష్కారానికి చర్యలు
- కొబ్బరి చెట్ల పరిరక్షణ బాధ్యత అందరిదీ
- 13 గ్రామాల్లో బాధిత రైతులతో భేటీ
- సమస్యలు విన్నారు..నిధులిస్తామన్నారు..

అమలాపురం/మలికిపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'సంస్కృతీ, సంప్రదాయాల్లో భాగమైన కొబ్బరిచెట్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కోనసీమ కొబ్బరి రైతాంగ సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిస్తాం' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలోని చింతలమోరి, కేశనపల్లి గ్రెయిన్‌లో ఉప్పు నీటి సాంద్రత వల్ల వేలాది కొబ్బరి చెట్లు నిర్జీవమైన పరిస్థితులను బుధవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కేశనపల్లిలోని వ్యూ పాయింట్ నుంచి రైతులకు జరిగిన నష్టాన్ని కళ్లారా చూశారు. కూటమి ప్రభుత్వం కొబ్బరి రైతులకు అండగా ఉంటుందన్నారు. 13 గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులతో భేటీ అయ్యారు. రైతుల సమస్యలు విన్న తర్వాత పవన్‌కల్యాణ్ మాట్లాడారు. 'నేను గతంలో కోనసీమ ప్రాంతంలో పర్యటించినప్పుడు శంకరగుప్తం డ్రెయిన్ సమస్య ఇంత తీవ్రంగా లేదు. సమస్య నా దృష్టికి వచ్చిన తర్వాత సమగ్ర అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలని భావించా. సమస్యలపై మూలాల నుంచి అవగాహన తెచ్చుకుంటే తప్ప శాశ్వత పరిష్కారం చేయలేం' అని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. 'ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డ్రెయిన్లు, పంట కాల్వల ఆధునికీకరణకు రూ.4 వేల కోట్లు అవసరమని అధికారులు తెలిపారు. శంకరగుప్తం డ్రెయిన్ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టేందుకు రూ.20.68 కోట్ల అవసరం ఉందన్నారు. 14 ఏళ్లుగా ఉన్న శంకరగుప్తం డ్రెయిన్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టిసారిస్తానన్నారు. నీటిపారుదలశాఖ నిపుణుడు డీసీ రోశయ్య రాసిన రిపోర్టుపై రెండు వారాల్లో అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించా రు. డిసెంబరు రెండో వారంలో ఈ సమస్యపై అధికారులు, రైతులతో మరోసారి సమావేశం నిర్వహిస్తాం' అని పవన్ ప్రకటించారు. 'కొబ్బరి రైతుల సమస్యలపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ వేస్తాను. 45 రోజుల్లో వారి సమస్యలపై శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తాం. సంక్రాంతి తర్వాత యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాను' రైతుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ 22 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ శంకరగుప్తం డ్రెయిన్ మధ్యలో ఎనిమిదిన్నర కిలోమీటర్లు డ్రెడ్జింగ్ చేయాలని, డ్రెయిన్‌కు ఇరువైపులా గట్లు ఎత్తు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకె ళ్లారు. జలవనరులశాఖ మంత్రి, టెక్నికల్ సిబ్బంది పరిశీలించి రూ.22 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆర్థికశాఖకు పంపారన్నారు. మీరు కల్పించుకుంటే వెంటనే నిధులు మంజూరవుతాయని, శంకరగుప్తం డ్రెయిన్ విధ్వంసం నుంచి రైతులు ఉపశమనం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ హరీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఉద్యానవన కమిషనర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మీకే నేనున్నా : కొబ్బరి రైతుల సమస్యలు వింటున్న పవన్





నేనున్నా..చూసుకుంటా : సమస్యల పరిశీలనకు కాలినడకన వెళుతూ పవన్ అభివాదం



మీ ముప్పు తీరుస్తా : ఉప్పుటేరు పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్





జన హారతి : పవన్ రాకకు మహిళల ఎదురుచూపులు



అన్నొస్తాడని : పవన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులు



సమస్యలు చెబుతాం : ముఖాముఖి సమావేశానికి రైతులు

రైతాంగ సంక్షేమమే లక్ష్యం : ఎంపీ హరీష్



రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల సమయంలో రాజోలు నియోజకవర్గానికి పవన్ కల్యాణ్ వచ్చినప్పుడు పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నాను గానీ నాకు రాజోలు నియోజకవర్గం అంటే చాలా ఇష్టమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి రేయింబవళ్లు కష్టపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఎక్కడా జరగలేదు.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనిస్తుంది..

పవన్ గుండెచప్పుడు..రాజోలు : ఎమ్మెల్యే దేవ



రాజోలు నియోజకవర్గానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రావడం చాలా సంతోషదాయకం. పవన్‌కల్యాణ్ ఆశయాలను నిలబెట్టింది మొట్టమొదటిసారిగా రాజోలు నియోజకవర్గ ప్రజలు.. డిప్యూటీ సీఎం పవన్‌కు రాజోలు నియోజకవర్గం గుండెకాయ వంటిది. నియోజకవర్గంలో వరి పంట 14 ఎకరాల్లో పండేది.. అటువంటిది 6 వేల ఎకరాల్లో వరి పండడంలేదు. ప్రతీ గ్రామంలో మంచినీటి ఎద్దడి నెలకొంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నియోజకవర్గంలో వంద మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారు. నియోజకవర్గానికి ఒక మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి కావాలి.

స్ఫూర్తివంతమైన 2.0 : కలెక్టర్



ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతోనే అభివృద్ధి బాట పడతాయి. పల్లెపండుగ 1.0లో సత్ఫలితాలకు కొనసాగింపుగా 2025 నవంబరు 26న ప్రారంభిస్తున్న పల్లె పండుగ 2.0కి ఇది స్ఫూర్తివంతమైన బాట వేసింది.

స్వర్ణ పంచాయతీలకు అడుగులు : సీఎస్



రెండో విడత బృహత్తర కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ నేతృత్వంలో కొత్త ప్రణాళికతో పనులు చేపట్టడానికి గ్రామాలు సిద్ధంగా ఉన్నాయి. రూ.6,787 కోట్లతో గ్రామగ్రామాన పల్లెపండుగ 2.0 అమలు జరుగుతుంది.స్వర్ణ గ్రామ పంచాయతీల ఏర్పాటుకుప్రభుత్వం అడుగులు వేస్తుంది.

సర్వనాశనమైపోయాం..



శంకరగుప్తం డ్రెయిన్ విధ్వంసం వల్ల సర్వనాశనమైపోయాం. మీరు తలచుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మా సమస్యను పరిష్కరిస్తాయి. రూ.22 కోట్లు కేటాయిస్తున్నామంటున్నారు. అది సరిపోదు.

- యెనుముల నాగు, సర్పంచ్, కేశనపల్లి

భూగర్భ జలాలు కలుషితం..



శంకరగుప్తం డ్రెయిన్ ఉప్పునీరు ఆటుపోట్లకు భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. భవనాలు బీటలు వారుతున్నాయి. కొబ్బరి పంట ఆదాయం కోల్పోయాం. మమ్మల్ని గట్టెక్కించాలి.

- అడబాల నాని, రైతు, కేశనపల్లి

చమురు సంస్థలతో ముప్పు



ఓఎన్జీసీ, గెయిల్, సీస్మిక్ సర్వేల వల్ల భూమి కుంగిపోతోంది. చమురు నిక్షేపాలను తరలించుకుపోతున్నారు. ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. మీరే మాకు న్యాయం చేయాలి.

- డాక్టర్ నాగయ్య యాదవ్, కేశనపల్లి రైతు

డ్రెయిన్‌ను డ్రెడ్జింగ్ చేయాలి



శంకరగుప్తం డ్రెయిన్‌ను డ్రెడ్జింగ్ చేయాలి. గట్లు ఎత్తు చేస్తే ఉప్పునీరు గ్రామాలు, తోటల్లోకి రాదు. చనిపోయిన కొబ్బరిచెట్లకు పరిహారమివ్వాలి. రైతులను ఆదుకోవాలి.

-చినవెంకన్నాయుడు, మాజీ సర్పంచ్, పడమటిపాలెం

సత్యదేవా నర్సరీలో కేరళ బృందం



నర్సరీని సందర్శిస్తున్న బృందం

కడియం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవా నర్సరీని బుధవారం కేరళ రాష్ట్ర రూరల్ లైవ్ లీహుడ్ మిషన్ (ఎస్ఆర్ఎల్ఎం) 40 మంది బృందం సందర్శించారు. నర్సరీ ఎండీ పుల్లా పెదసత్యనారాయణ వారికి స్వాగతించారు. మొక్కల పెంపకం, ఏపీ ప్రాంతంలో ఎటువంటి మొక్కలు పెంపకానికి అనువుగా ఉంటుందని తెలుసుకున్నారు. నర్సరీలో స్వదేశీ, విదేశీ మొక్కలు చూసి వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, ఎంపీపీ వెలుగు బంటి ప్రసాద్, పుల్లా రామకృష్ణ, డీఆర్‌డీఏ అధికారులు, తదితరులు ఉన్నారు.

నూతన నటీనటులతో కల్ట్ సినిమా : దర్శకుడు



క్లాప్ కొడుతున్న నటుడు దత్తు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ నేపథ్యంలో అస్త్ర మూవీ మేకర్స్ బ్యానర్లో నూతనంగా నిర్మిస్తున్న కల్ట్ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం కాకినాడ దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం హీరో, హీరోయిన్లు శ్రీమంత్, అక్షరపై దర్శకుడు హరీష్ క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ మాట్లాడుతూ నూతన నటీనటులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు పేర్కొన్నారు. చిత్రానికి సహనిర్మాతగా బీవీఎస్ఎస్ ప్రసాద్, కెమెరామెన్‌గా లోకేష్ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా సహ నిర్మాత ప్రసాద్, హీరో, హీరోయిన్లు మాట్లాడుతూ యువతలో క్రికెట్ పట్ల ఉండే ఇష్టం ఆధారంగా ఆసక్తికర కథనంతో సినిమాను తెరకెక్కించడం జరుగుతోందన్నారు. ఇది అందరికీ నచ్చే విధంగా చిత్రం ఉంటుందన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లోని నటీనటులకు అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. సినీ నటుడు దత్తు, స్టీవిన్, మధు, లోవేశ్వరరావు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

నిడదవోలును స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా మారుస్తాం

- వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి నారాయణ ప్రకటన
- కూటమి ప్రభుత్వంలో పురపాలక సంఘంలో రూ. 151 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు : మంత్రి దుర్గేష్



మాట్లాడుతున్న మంత్రి పొంగూరి నారాయణ

నిడదవోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని, దీన్ని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని, ఉత్సవాలు పూర్తయ్యే నాటికి (ఈ నెల 28వ తేదీ సాయంకాలానికి) మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ జీవో కాపీని అందిస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ ప్రకటించారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద నిడదవోలు వజ్రోత్సవ చిహ్నాన్ని మంత్రి దుర్గేష్‌తో కలసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన వజ్రోత్సవ వేడుకల వేదికపై ఆయన మాట్లాడుతూ నిడదవోలు పట్టణానికి పూర్వవైభవం తీసుకురావడానికి కలసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి కందుల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే 400 కోట్ల రూపాయిలతో నిడదవోలు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చామన్నారు. ఒక్క నిడదవోలు పట్టణంలోనే రూజ 151 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, త్వరలో నిడదవోలును అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పరుస్తామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆలోచనలకు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి పరచడంలో తాను ప్రజా సేవకుడిగా పనిచేస్తున్నానన్నారు. త్వరలోనే నిడదవోలు ప్రజలకు గోదావరి జలాలను అందించడంతో పాటు మినీ స్టేడియం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నానన్నారు. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా రూ. మూడు కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణాభివృద్ధికి మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు కష్టపడి పనిచేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. సభా వేదికపై సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు రచించిన నిడదవోలు చరిత్ర పుస్తకాన్ని మంత్రులు నారాయణ, దుర్గేష్, తదితరులు ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఆర్డీవో రాణీసుస్మిత, మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎంతో సంతృప్తినిచ్చింది

- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతృప్తినిచ్చిందని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద ఉన్న వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలకు మంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి రూ.25లక్షలతో స్వర్ణ వేలాయుధం

- సంకల్పించిన భక్తుడు కంబాల శ్రీనివాసరావు
- తొలుత రూ.13 లక్షలతో 100 గ్రాముల బంగారం కొనుగోలు



స్వామివారికి బంగారాన్ని సమర్పిస్తున్న కంబాల శ్రీనివాసరావు దంపతులు

కోరుకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ ప్రధాన రహదారిలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి రూ.25 లక్షలతో స్వర్ణ వేలాయుధం చేయించడానికి భక్తుడు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు సంకల్పించారు. గురువారం కోరుకొండలో ప్రారంభమైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవలే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయ నూతన పునఃప్రతిష్ఠ జరిగిందన్నారు. అప్పుడు ఆలయాన్ని సందర్శించినప్పుడు స్వామివారి చేతిలో ఉండే ఆయుధమైన వేలాయుధం రూ.25 లక్షల వ్యయంతో చేయిస్తానని ప్రకటించానన్నారు. అప్పటి మాజీ సర్పంచ్ కటకం చలంకి లక్ష రూపాయలు విరాళం అందజేశానని, ఆయన వాటితో తులం బంగారం కొనుగోలు చేశారన్నారు. కాగా, మంగళవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి రాజమహేం ద్రవరం బీమ జ్యువెలర్స్‌లో రూ.13 లక్షలతో 24 క్యారెట్ల 100 గ్రాముల బంగారాన్ని కొనుగోలు చేశారన్నారు. ఈ బంగారాన్ని షష్ఠి సందర్భంగా స్వామివారి సన్నిధిలో పెట్టామన్నారు. అలాగే డిసెంబర్ నెలలో మరో 14 తులాల బంగారాన్ని కొనుగోలు చేసి మొత్తం 25 తులాల బంగారంతో వేలాయుధం తయారు చేయించి, కోరుకొండ మండలంలో ప్రతి గ్రామానికి ప్రజల దర్శనార్థం ఊరేగించి, స్వామివారిని అలంకరిస్తామన్నారు. అలాగే కాప వీరబాబు అనే వ్యక్తి గత రెండేళ్ల క్రితం రథం కిందపడి కాలు నలిగిపోయి కాలును తొలగించారు. కంబాల శ్రీని వాసరావు వద్దకు వచ్చి సహాయం చేయాలని కోరగా స్పందించిన ఆయన జైపూర్ నుంచి లక్ష రూపాయలు వ్యయంతో కృత్రిమ కాలును తెప్పిస్తున్నట్టు తెలిపారు. ఆలయ బ్రాహ్మణులు ఉండటానికి వసతి గృహాన్ని నిర్మించాలని కమిటీ సభ్యులు కోరగా, నిర్మాణానికి సహాయం అందిస్తానని ప్రకటించారు. అనంతరం రామసేన కార్యాలయం వద్ద భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కఠినమైన అభ్యాసం అవసరం

- ఆంధ్రా విశ్వవిద్యాలయం సీఎస్‌సీఇ విశ్రాంత ఆచార్యులు పీఎస్ అవధాని



సెమినార్‌లో ప్రసంగిస్తున్న విశ్రాంత ఆచార్యులు అవధాని

దివాన్‌చెరువు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పరిశ్రమ ప్రమాణాలను అందుకోవడానికి కఠినమైన అభ్యాసం అవసరమని ఆంధ్రా విశ్వవిద్యాలయం సీఎస్‌సీఇ విశ్రాంత ఆచార్యులు పీఎస్ అవధాని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల, సైన్స్ అండ్ హ్యూమనిటీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రోగ్రామింగ్ స్కిల్స్ అనే అంశంపై ఒకరోజు సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. ఈసమావేశంలో కీలక ఉపన్యాసకులుగా అవధాని పాల్గొని ప్రసంగించారు. అనంతరం వీసీ ఆచార్య ప్రసన్నశ్రీని కలసి విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ఈసందర్భంగా అవధానిని వీసీ ప్రసన్నశ్రీ సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, డీన్ పి. సురేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

అండర్ - 19 కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎస్‌కేఆర్ మహిళా కళాశాల విద్యార్థినులు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వతంత్ర హాస్పిటల్ దగ్గరలో గల అంబేడ్కర్ ఈ భవన్‌లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ -19 కరాటే ఉమెన్ స్టేట్ సెలెక్షన్స్‌లో శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల విద్యార్థినులు కేటగిరీ 52 విభాగంలో వేముల వంశిక లక్ష్మి (ఇంటర్ సిఇసి రెండో సంవత్సరం),గోల్డ్ మెడల్ కేటగిరీ 68వ విభాగంలో పాయం కీర్తన (ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం), అలాగే సిల్వర్ మెడల్ సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల డిసెంబరు 12వ తేదీ నుంచి 16 వరకు మధ్యప్రదేశ్‌లో జరగబోయే కరాటే నేషనల్స్‌లో వేముల వంశిక లక్ష్మికళాశాల తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్లు ఫై.సుధారాణి, నాగు, కరాటే కోచ్ అరుణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో అచ్చంపేట క్రీడాకారుడు ప్రతిభ



డబుల్స్ చాంపియన్ షిప్‌లో పతకం పొందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు హరికృష్ణ

సామర్లకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యానెక్స్-సన్‌రైజ్ 48వ జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్-2025 పోటీలు అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఇటానగర్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ రాత్రి వరకు జరిగాయి. ఇందులో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన వీరంరెడ్డి హరికృష్ణ చిత్తూరు జిల్లాకు చెందిన తిప్పన చరణ్‌రామ్ అండర్-19 కేటగిరీ డబుల్స్ విభాగంలో కాంస్యపతకాన్ని కైవసం చేసుకున్నారు. బుధవారం రాత్రి ఇటానగర్ నుంచి రైలులో సామర్లకోట చేరుకున్న అచ్చంపేట క్రీడాకారుడు హరికృష్ణకు అదే గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు జిల్లా క్రీడాకారులు ఘనంగా స్వాగతం పలికి అభినందించారు. హరికృష్ణ హైదరాబాద్‌లోని ఒక జాతీయ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. వీరిని పలువురు అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరా.. శరణు.. శరణు


ప్రత్యేక అలంకరణలో బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి



అంగరంగ వైభవంగా శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు

భక్తులతో పోటెత్తిన బిక్కవోలు

బిక్కవోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల్లో పేరొందిన తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున 1.10 గంటలకు స్వామివారి తీర్థపు బిందె సేవతో ఉత్సవకమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనాలు కల్పించారు. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయం 3వైపులా బారులు తీరారు. సంతానార్థులైన స్త్రీలు స్వామి పుట్టపై ఉంచిన నాగుల చీరను ధరించి ఆలయం వెనుక శయనించారు. ఉదయం 7.20 గంటలకు స్వామివారిని మయూర వాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. 10 గంటల నుంచి 4 గంటల వరకూ షష్ఠి కళావేదికపై కేరళ చండీ వాయిద్యాలు, ఉమ్మలాడ, భీమవరం, దువ్వ, బిక్కవోలు వారిచే నిర్వహించిన బ్యాండు కచేరీలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటల వరకూ కాల్చిన బాణసంచా కనువిందు చేసింది. లక్షకు పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

దర్శించిన ప్రముఖులు..

స్వామివారిని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, దేవదాయశాఖ ఆర్‌జేసీ వి.త్రినాధరావు, డిప్యూటీ కమిషనర్ డి.రమేష్‌బాబు, డీఈవో ఈవి సుబ్బారావు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ బిఎం మురళీకృష్ణ, డీఎస్పీ బి.విద్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య దర్శించుకున్నారు. 300 మందితో బందోబస్తు ఏర్పాట్లు చేశామని అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు.

కనువిందు చేసిన బాణసంచా..

షష్ఠి ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన గోలింగేశ్వరాఫైర్ వర్క్స్, హస్సేనియా కనకదుర్గా ఫైర్ వర్క్స్ గంటసేపు కాల్చిన బాణసంచా భక్తులను కనువిందు చేసింది. బ్యాటరీ బాక్సులు, బొట్ల చెట్లు, రాకెట్‌లు, కలర్ జువ్వలు కాల్చారు.


శక్తి వేషాలు, నెమలి నృత్యాలు, కేరళ వాయిద్యాలు




ఆలయంలో భక్తులు



ఉపవాస దీక్షతో నిద్ర

గొల్లప్రోలు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో స్వయంభూ వల్లీ దేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. సంతాన ప్రాప్తి కోసం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు మంగళవారం సాయంత్రానికే చేరుకుని ఉపవాస దీక్ష చేశారు. ఉగ్రషష్ఠి మండపంలో నిద్రించారు.


మల్లవరంలో ఉపవాస దీక్షతో నిద్రించిన మహిళలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం... కమనీయం

అన్నవరంలో సుబ్రహ్మణ్యేశ్వరుడి వార్షిక దివ్యకల్యాణం

దర్శించి తరించిన భక్తజనం

అన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో వల్లీదేవసేన సమేతుడిగా పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వరుడి వార్షిక దివ్యకల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి,అమ్మవార్లను బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ఆలయం నుంచి వార్షిక కల్యాణం జరిగే హైస్కూల్ ప్రాంగణం వద్దకు తోడ్కొనివచ్చి సర్వాంగ సుందరంగా వివిధ పుష్పమాలికలతో తీర్చిదిద్దిన ప్రత్యేకవేదికపై ఆశీనులు గావించారు. అర్చకస్వాములు గణపతిపూజ, పుణ్యాహవచనం, కన్యావరుణలు జరిపి అమ్మవారితో మంగళగౌరీపూజ నిర్వహించారు. అనంతరం వేదపండితులు ప్రవరను పఠించి సుబ్రహ్మణ్యేశ్వరుడికి ద్విజత్వాన్ని ప్రసాదించే యజ్ఞోపవీతాన్ని అలంకరింపచేశారు. పాదప్రక్షాళన గావించి మదుపర్కప్రాశన చేశారు. చతుర్వేదపండితులు దేశకాలమాన పరిస్థితులు వివరించే ప్రవరను పఠించారు. సుముహూర్త వేళ అమ్మవారి మెడలో స్వామి మూడుముళ్లు వేశారు. అనంతరం ఒకరి శిరస్సుపై మరొకరు ముత్యాల తలంబ్రాలు పోసుకుంటూ వేడుక నిర్వహించారు. పట్టుపీతంబరాలు, విశేష అభరణాలతో నుదుటతిలకం, బుగ్గనచుక్కతో స్వామిఅమ్మవార్లు దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణతంతును చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాబి తదితరులు నిర్వహించారు. షష్ఠి పర్వదినం పురస్కరించుకుని స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించి తరించారు.


ఆలయానికి విద్యుత్ అలంకరణ


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

శభాష్.. స్వాతి

మాక్ అసెంబ్లీ స్పీకర్‌గా ఆదర్శ పాఠశాల విద్యార్థిని

శాసనసభను విజయవంతంగా నిర్వహించిన నెల్లిపూడి బాలిక

శంఖవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో శంఖవరం విద్యార్థిని అదరగొట్టింది. స్పీకర్‌గా శభాష్ అనిపించుకుంది. శాసనసభను విజయవంతంగా నిర్వహించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రుల సమక్షంలో సభను ఆమె నిర్వహిస్తుంటే ఇక్కడి ప్రజలు ఆన్‌లైన్‌లో వీక్షించి అబ్బురపడ్డారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం అమరావతిలో మంత్రి నారా లోకేశ్ ఆధ్వ ర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కాకినాడ జిల్లా శంఖవరం ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నెల్లిపూడి గ్రామానికి చెందిన సైపిరెడ్డి స్వాతి ఎంపికైంది. పిరికి లేకుండా, చొరవగా అవగాహనతో మాట్లాడే లక్షణాలు ఉండడంతో ఆమెను ఈ అవకాశం వరించింది. సభాపతిగా ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందని.. జీవితంలో మర్చిపోలేని అవకాశమిచ్చిన ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపింది స్వాతి. ఆమెకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంఈవో ఎస్వీ రమణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.




స్పీకర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న స్వాతి

సామర్లకోట వీబీఆర్ఐ పూర్వవైభవానికి సన్నాహాలు

రాష్ట్ర వెటర్నరీ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రజనీకుమారి

సామర్లకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు పలు వ్యాధినిరోధక వ్యాక్సిలన్లు ఉత్పత్తి చేసే సామర్లకోట వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు (వీబీఆర్ఐ) పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని రాష్ట్ర వెటర్నరీ అడిషనల్ డైరెక్టర్(హెల్త్) డాక్టర్ రజనీకుమారి తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా సామర్లకోటలో వీబీఆర్ఐ వ్యాక్సీన్‌ల ఉత్పత్తి కేంద్రాన్ని ఆమె సందర్శించారు. పలు వ్యాక్సిన్ ఉత్పత్తి ల్యాబ్‌లు, భవనాలు, ల్యాబ్ పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వీబీఆర్ఐ జేడీ డాక్టర్ షనీలాకుమారి, అసిస్టెంట్ డైరక్టర్లు డాక్టర్ సూర్యకుమారి, డాక్టర్ శ్రీనివాసుతో సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 25 నుంచి మేకలలో మశూచి వ్యాధి నివారణకు వ్యాక్సీన్లను అందించే కార్యక్రమం ప్రారంభించామన్నారు. డిసెంబరు 15 వరకూ నిర్వహిస్తున్నందున ఆయా ప్రభుత్వ పశువైద్యశాలల ద్వారా వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం సామర్లకోట ఏరియా పశువైద్యశాలలో ఏడీ డాక్టర్ ఈ ప్రమీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొని పలు పథకాలను పశుపెంపకందారులకు వివరించారు. రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని రజనీకుమారి వీబీఆర్ఐ డాక్టర్లతో కలిసి నిర్వహించి అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.


సామర్లకోటలో సమీక్షిస్తున్న రజనీకుమారి

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

అంబాజీపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు జడ్జి వై.బైన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలో 25 ఏళ్ల మానసిక దివ్యాంగురాలు రాత్రి సమయంలో స్థానికంగా ఉన్న కట్టా బ్రహ్మేశ్వరరావు ఇంటికి వెళ్లి ఆహార పదార్థాలు తీసుకుని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో జనసంచారం లేని ప్రదేశంలో 55 ఏళ్ల కట్టా పాటియ్య బాధితురాలిని దారిలో అడ్డగించి ఎత్తుకుని కొబ్బరితోటల్లోకి బలవంతంగా లాక్కుని వెళ్లిపోయాడు. బలవంతంగా ఆమెను అనుభవించిన్నట్లు ఈ విషయాన్ని చెబితే చంపేస్తానని బెదిరించినట్లు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2024లో ఎస్ఐ కె.చిరంజీవి కేసు నమోదు చేయగా అప్పటి సీఐ డి.ప్రశాంత్‌కుమార్ దర్యాప్తు నిర్వహించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేపట్టిన కోర్టులో ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఇటీవల జరిగిన ట్రైల్ నందు 8వ అదనపుజిల్లా కోర్టు పీపీ డి.రాధాకృష్ణరాజు ప్రాసిక్యూషన్ తరుపున బలమైన వాదన వినిపించగా జిల్లా జడ్జి బైన్నయ్యానాయుడు మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేసిన నిందితుడికి 10సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. బాధితురాలికి పరిహారాన్ని నిర్ణయించి చెల్లించాల్సిందిగా రాజమహేంద్రవరం జిల్లా న్యాయసేవల ఆథారిటీకి సిఫార్స్ చేశారు.

తైక్వాండో పోటీలలో ఉమ్మడి జిల్లాకు ఐదు పతకాలు


జాతీయస్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి):ఈనెల 23నుంచి 25వ తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీలో జరిగిన 41వ సీనియర్ జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాకు చెందిన క్రీడాకారులు ఐదు పతకాలు (4 బ్రాంజ్, 1సిల్వర్) సాధించారని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. పి.హరికిరణ్ సిల్వర్ మెడల్ సాధించగా, వై.గంగాభవాని, జి.వంశీ, ఎల్.వెంకన్నదొర, ఎం.హర్షవర్ధన్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ టోర్నమెంట్‌కి పి.భార్గవి కోచ్‌గాను, ఆర్.మణికంఠ మేనేజర్‌గాను వ్యవహరించారు. సీనియర్ ఏపీ టీం జాతీయస్థాయిలో రెండో స్థానా న్ని పొందారు. జాతీయస్థాయిలో మెడల్స్ సా ధించిన వారిని డీఎస్‌డీవో సతీష్ కుమార్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వీరభద్రారెడ్డి, తైక్వాండో జిల్లా అధ్యక్షులు జి.ఎలీషాబాబు, ఏ మధుసూదన్‌రావు, కోచ్‌లు వీఎన్ సత్యనారాయణ, ఎన్ తులసి, కేవీ సత్యనారాయణ, ఎంపీ త్రిమూర్తులు, ఎస్.రత్న, తదితరులు అభినందించారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలపై బిడ్డర్‌లకు నేడు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ బస్‌స్టేషన్ల పరిధిలోని 13 ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ఈనెల 27వ తేదీన రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలోని రీజనల్ ట్రైనింగ్ కళాశాలలో ఔత్సాహిక బిడ్డర్‌లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనపర్తి, కొవ్వూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, పెద్దాపురం, తుని, మండపేట ప్రాంతాల్లో ఈ ఖాళీ స్థలాలు ఉన్నాయని, 15 ఏళ్లపాటు లీజుకు ఇవ్వడం కోసం సదస్సు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి కంటి పొర శస్త్రచికిత్స శిబిరం

సామర్లకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం ఆవరణలో శంకర నేత్రాలయ(చెన్నై) వైద్యశాల, ఎర్నేని కుటుంబం, నటరాజనాట్య మండలి(అమెరికా) సంయుక్త నిర్వహణలో గురువారం ఉచిత కంటిపొర శస్త్రచికత్స శిబిరం ప్రారంభించనున్నట్లు ఆలయ ధర్మకర్తమండలి చైర్మన్ కంటే జగదీస్‌మోహన్, ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠంలు చెప్పారు. వారం రోజులపాటు నిర్వహించనున్న వైద్యశిబిరంలో చెన్నై శంకర నేత్రాలయం నుంచి ఒక ప్రత్యేక వాహనం రానుందని సుమారు 25 మంది కంటి వైద్యనిపుణులు పాల్గొంటారన్నారు.

కల్యాణ మండపంలో అగ్నిప్రమాదం

● ఏసీ నుంచి మంటలు ● కమ్మేసిన భారీగా పొగ


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది, కాలిపోయిన ఏసీ

తుని రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):తుని పట్టణంలో బెల్లపువీధి ఆర్యవైశ్య కల్యాణ మండలంలో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెళ్లి బృందం పెళ్లి వేడుకలో నిమగ్నమవ్వగా ఒక్కసారిగా మండపంలో నల్లటి పొగ కమ్మేసింది. ఏం జరిగిందో తెలియని ఆందోళనకర వాతావరణంలో పెళ్లి వారంతా అక్కడి నుంచి పరుగులు తీశారు. కొద్దిసేపటికి చూడగా వసతి గదుల ఫ్లోర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో ఏసీ కాలిపోతున్నట్లు గమనించిన కల్యాణ మండల ని ర్వాహకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రా ణనష్టం జరగకపోవడంతో నిర్వాహకులతో పాటు, పెళ్లిబృందం ఊపిరి పీల్చుకున్నారు.

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయండి

రాజమహేంద్రవరంలో కేంద్ర కార్మిక సంఘాల నిరసన ర్యాలీ


నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు పలువురు పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా శ్యామలాసెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండు మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ మాట్లాడుతూ ఏ రంగంలో పని చేసే కార్మికునికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధరరావు తదితరులు మాట్లాడారు. ఈఆఈ ఈ కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు బి.పవన్, కొండలరావు, పి.లావణ్య, సప్పా రమణ, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హాకీలో పీఆర్ విద్యార్థుల ప్రతిభ

● జాతీయస్థాయి పోటీలకు ముగ్గురు బాలికలు, ఇద్దరు బాలురు ఎంపిక

● అభినందించిన డీఐఈవో శారద, ప్రిన్సిపాల్ రాంబాబు


హాకీలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈవో శారద, ప్రిన్సిపాల్ జ్యోతుల రాంబాబు

కాకినాడరూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రెండు రోజులపాటూ డీఎస్ఏలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి బాల,బాలికల హాకీ టోర్నమెంట్‌లో కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళా శాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు తెలిపారు. ఈపోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల హాకీ జట్టు ప్రథమ స్థానాన్ని సాధించగా ఆజ ట్టులో తమ కళాశాల బాలికలు ఆరుగురు ఉండగా వారిలో సాయిధన రాజేశ్వరి, యోగామృత, అంబికా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అదే విధంగా బాలుర జట్టు ద్వితీయస్థానాన్ని సాధించగా వారిలో కార్తికే ఉదయ్‌రాజు, విజయ్ ధనుష్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిణి ఐ.శారద, ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు అభినందించారు.

భావనారాయణస్వామి భూములపై ఉమ్మడి సర్వే ప్రారంభం


సర్పవరంలో సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న దేవదాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు

సర్పవరంజంక్షన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే పురాతన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన కాకినాడజిల్లా కాకినాడరూరల్ సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూముల సంరక్షణ కోసం దేవదాయ,ధర్మాదాయ, రెవెన్యూ శ్రీకారం చుట్టారు. బుధవారం సర్పవరంలో భావనారాయణస్వామికి చెందిన పలు ఆర్ఎస్ నెంబర్ 6/3లో 2.57 ఎకరాల భూమి, సర్వే నెంబర్ 6/4లో 3.93 ఎకరాల భూమిలో దేవదాయ,ధర్మాదాయశాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, ఈవో రేపాక శ్రీనివాసరావు, రెవెన్యూ సర్వేయర్ ఎం.సతీష్‌ల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవస్థానం భూముల సంరక్షణ కోసం జాయింట్ సర్వే చేపట్టామన్నారు. దేవస్థానం భూములు ఆక్రమణదారుల పరం కాకుండా ఉండేందుకు వీలుగా సర్వే చేపట్టామన్నారు. ఎక్కడైనా అన్యాక్రాంతమైన భూములు ఉంటే వాటిని గుర్తించి, సర్వే చేపట్టి భూములను తిరిగి స్వాధీనానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. భావనారాయణస్వామికి చెందిన భూములపై సమగ్ర సర్వే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ గుమస్తా బోనం కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యాన్ బోల్తా

● తప్పిన ప్రమాదం


జాతీయరహదారిపై బోల్తాకొట్టిన వ్యాన్

గండేపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వ్యాన్ గండేపల్లి వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ ఢీకొంది. వ్యాన్ బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కా కపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. త్రుటిలో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

ఐ.పోలవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కొమరగిరి సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వ్యవసాయం, ఆరోగ్యం, పోషణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ముమ్మిడివరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ప్రాంగణంలో లాడే సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఏపీజీ కాశి సిద్ధార్థ కుమార్, దోనిపాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు






పి.గన్నవరంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, అమలాపురం: మాట్లాడుతున్నమానవహక్కుల నాయకుడు కృష్ణ, అంతర్వేది: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- అంబేడ్కర్‌కు ఘన నివాళి

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే భారత ప్రజాస్వామ్యానికి తీరని ముప్పు అని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల నాయకుడు వీఎస్ కృష్ణ పేర్కొన్నారు. అమలాపురం కలెక్టరేట్ ఎదుట అంబేడ్కర్ భవన్‌లో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ సభను మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు ఎ.రవి, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావుల అధ్యక్షతన నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక నాయకుడు డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ చైర్మన్ రమేష్ పట్నాయక్, మేలుకో ఆంధ్రప్రదేశ్ నాయకుడు కేఎంఏ సుభాన్ మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. భారత రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో ఎర్రవంతెన వద్ద గిడ్డి జ్ఞానప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో దడాల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బళ్ల సత్యనారాయణ, బడుగు సత్యనారాయణ పాల్గొన్నారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో పెయ్యల పరశురాముడు అధ్యక్షత వహించగా ఆర్పీఐ రాష్ట్ర నాయకుడు డీబీ లోక్, నాయకులు జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు, ఐఎన్ మల్లేశ్వరరావు, పెయ్యల శ్రీనివాసరావు, ఈవీవీ సత్యనారాయణ, రేవు తిరుపతిరావు, నాతి శ్రీనివాసరావు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి రాజ్యాంగ విశిష్టతను వివరించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో ఈదరపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో ఏఐసీసీ పరిశీలకుడు అఖిలేష్ శుక్లా ముఖ్యఅతిథిగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ జంగా గౌతమ్, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, జిల్లా ఇన్‌చార్జి అరిగెల అరుణ, చీకట్ల అబ్బాయి, యర్లగడ్డ రవీంద్ర పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ముమ్మిడివరంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ముమ్మిడివరం మండల శాఖ ఆధ్వర్యంలో మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన పోలమ్మచెరువుగట్టున గల అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం వద్ద నగర కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో, ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా చేశారు. కాశి వెంకటాచార్య, జనిపల్లి బాలకృష్ణ, ఎం.ఆశీర్వాదం, జె.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, రామకృష్ణప్రసాద్, జి.సూర్య సునీత, డాక్టర్ వై.లోకేశ్ పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం సెంటర్‌లో బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు వస్కా శ్యామ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కరజోగేష్, గిడ్ల వెంకటేశ్వరరావు, దంగేటి వెంకటరమణ, వెలిగట్ల సాయిబాబాబు, బడుగు వెంకటేష్, జె.చిన్ని, మధుర రమేష్, నక్కా వేణు, ముత్తాబత్తుల పృథ్వీ పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, సామాజిక న్యాయం ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పి.గన్నవరంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత జన సేన పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలామలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక నాయకులు సమక్షంలో త్రీ రోడ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండాడ నాగమణి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, చెల్లియిన గంగాదేవి, చీకరమిల్లి వెంకటేశ్వరావు, ఆదిమూలం సూరయ్యకాపు, పులపర్తి సూజాత, తాటికాయల శ్రీనివాసరావు, కోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో వైసీపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు స్థానిక నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిం చారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మందపాటి కిరణ్ కుమార్, స్థానిక నాయకలు పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): బుధవారం కందికుప్ప పీఏసీఎస్ వద్ద సొసైటీ చైర్మన్ నూకల వీవీఎస్ఎన్‌వి ప్రసాద్(మూర్తి) బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ ప్రపంచంలో మనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో యర్రంశెట్టి రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): భీమనపల్లి బాలుర హాస్టల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా అమలు చెయ్యాలని మాలమహానాడు అధ్యక్షుడు కొంకి వెంకటబాబ్జి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, హాస్టల్ అధికారి కె.ప్రవీణ్‌కుమార్, తిరుకోటి చరణ్‌తేజ, పండు రాజేష్, చాట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. భీమనపల్లి సొసైటీ వద్ద చైర్మన్ ఆకేటి శ్రీనివాస్ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి, మోరిపోడు శివారు సూర్యనారాయణపేటలో అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యండాపు సంపదరావు, నల్లి ప్రసాదరావు, గంటా బాలాజీ, నల్లి రాజ్‌కుమార్, యువజన నాయకులు పాల్గొన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో బి.మమత ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. పలు గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి సుబ్బారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులుర్పించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ జల్లి బాలరాజు, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, అరిగెల సూరిబాబు, దొమ్మేటి సాయికృష్ణ, కొప్పినీడి ఈశ్వరరావు, నాగవరపు అన్నవరం పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): మొగళ్ళమూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎంపీ చింతా అనురాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతీ ఒక్కరూ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలన్నారు. గోడిలంకలో కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీదుర్గారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కుంచే చంద్రరావు, పోతుల నాగేశ్వరరావు, గోసంగి పల్లయ్య, బళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను పరిరక్షించాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. బుధవారం ఆయన రాజ్యాంగ దినోత్సవాన్ని మురమళ్ళలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు), పార్టీ మండలాధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, ధూళిపూడి బాబి, అర్దాని శ్రీనివాసరావు, గొలకోటి దొరబాబు, బీర సత్యకుమారి పాల్గొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో పాత ఇంజరం అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది మధుర త్రివిక్రమ్‌ప్రసాద్‌ను సత్కరించారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు రేవు శ్రీనివాస్, వడ్డి గౌతమ్, మట్ట గగనవీరుడు, జనిపెల్ల విప్లవకుమార్, ములపర్తి శ్రీను, పండు మురళి, తాళ్ళూరి ప్రసాద్, పండు విజయ్‌కుమార్, కర్నీడి సత్తిబాబు, యలమంచిలి సురేష్ పాల్గొన్నారు.

యానాం,(ఆంధ్రజ్యోతి): యానాంలో ఎస్సీ ఎస్టీ యునైటెడ్ ఫోరం అధ్యక్షుడు పోనుగుమట్ల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్‌నగర్ బుద్ధాపార్కులో ఎస్సీ ఫోరం ఉపాధ్యక్షుడు నామాడి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విశ్రాంత పరిపాలనాధికారి గిడ్డి బలరాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిరుకోటి నాగేశ్వరరావు, పండు సిద్ధార్థ కుమార్, గుర్రపు ప్రహ్లాదుడు, మారి సత్యనారాయణ, ఇసుకపట్ల పాపారావు, కోరుకొండ రాజేంద్రప్రాసద్, పంతగడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా...నమోస్తుతే






ముమ్మిడివరం, అల్లవరం, ఐ.పోలవరం, అంబాజీపేటలలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లు

- సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు
- ఆలయాల్లో అభిషేకాలు, పూజలు

అమలాపురం టౌన్/రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. అమలాపురం శ్రీకృష్ణేశ్వరస్వామి ఆలయం, బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యుని కల్యాణాలు నిర్వహించారు. గుమ్మిడి సద్గురు సత్యనారాయణ ఆచార్య బ్రహ్మత్వంలో చింతా అత్తిలింగం-వీరభద్రమణి సోదరుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. కృష్ణేశ్వరస్వామి ఆలయంలో కార్యనిర్వహణాధికారి ఆర్.శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ ఏలూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. కృష్ణేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, సతీమణి నివేదిత, పిల్లలతో కలసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవస్థానం వేదపండితుల ఆధ్వర్యంలో వారికి వేదాశీర్వచనం అందజేసి సత్కరించారు. ఎ.వేమవరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద దేవస్థానం చైర్మన్ కొంపెల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి దర్శన సదుపాయం భక్తులకు కల్పించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు దర్శనాలు చేసుకున్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో సుబ్రహ్మణ్యషష్ఠి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. క్రాపచింతలపూడిలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం, హోమాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముమ్మిడివరం, ఠాణేలంక, కొత్తలంక వంటి పలు గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు జరిగాయి. చినకొత్తలంకలో పుట్టలో వెలసి ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి బుధవారం లక్ష చామంతి పూజ వైభవంగా జరిగింది. స్వామివారికి ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ బ్రహ్మత్వంలో బాబుశర్మ, వెంకటేష్‌శర్మ, గిరిశర్మ, శేఖర్‌శర్మ, ప్రణయ్ శర్మల మంత్రోచ్చారణలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఈఆలయంలో ఆరు మంగళవారాలు అభిషేకాలు నిర్వహించి స్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆలయ ధర్మకర్తలు పచ్చమట్ల సుబ్బరాజు, ముదునూరి శ్రీరామచంద్ర వెంకటకృష్ణంరాజు-రూపవతి, ముదునూరి సుబ్బరాజు, వెంకటరామకృష్ణంరాజు, ప్రశాంత్‌వర్మ, అభినవవర్మ ఆధ్వర్యంలో లక్ష చామంతి పూజను కనుల పండుగగా జరిపారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి తీర్థ వేడుకలు నిర్వహించారు. కాట్రేనికోన, కుండలేశ్వరం, చెయ్యేరు, నడవపల్లి, గెద్దనపల్లి, కొప్పిగుంట, దొంతికుర్రు, పల్లం, కందికుప్ప, బలుసుతిప్ప, ఉప్పూడి, బంటుమిల్లి, పెనుమెల్ల, లక్ష్మీవాడ, పల్లంకుర్రు, చిర్రయానాం గ్రామాల్లో షష్ఠి తీర్థ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. ఎన్.కొత్తపల్లి, ఎస్.యానాం సుబ్రహ్మణ్యేశ్వరాలయాల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు విశేష పూజలు చేశారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ ఈదరపల్లి శ్రీనివాసరాజు, వాటర్ డీసీ వైస్ చైర్మన్ గుత్తుల శ్రీనివాస్, మల్లాడి వెంకటరమణ, అర్దాని శ్రీను, పినిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు. గొల్లవిల్లి, సన్నవిల్లి, ఉప్పలగుప్తం, చల్లపల్లి, గోపవరం, విలసవిల్లి, భీమనపల్లి, కూనవరం, వానపల్లిపాలెం తదితర గ్రామాల్లో షష్ఠి తీర్థాలు నిర్వహించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మాచవరంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివార్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా స్వామి వార్కి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద తీర్థం జరిగింది. పుల్లేటికుర్రులో సుబ్రహ్మణేశ్వరస్వామి వారి కల్యాణం సర్వేజనా సుఖినోభవంతు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారం, ఇరుసుమండలంలో వేంచేసియున్న శ్రీవల్లీదేవసేన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠి వేడుకలు నిర్వహించారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలను బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారి ఆలయాల వద్ద భక్తులు బారులుతీరి సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. బి.దొడ్డవరంలోని బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పాలకావిడిల సంబరాన్ని నిర్వహించారు. మహిళలు తీర్థపు బిందెలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. పెదపట్నం, ఆదుర్రు, ఈదరాడ, పాశర్లపూడి లంక తదితర గ్రామాల్లో షష్ఠి తీర్థం ఘనంగా జరిగింది.



ఉప్పలగుప్తం:ఎన్.కొత్తపల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు గుడ్డివానిచింత, కొమరగిరిపట్నం వద్ద ఉన్న ఆలయాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్ని దర్శించుకున్నారు. బోడసకుర్రు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజారి శ్రీకంఠం కామేశ్వరరావు ఆధ్వర్యంలో పండ్ల రసాలు, నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. బోడసకుర్రులో భారీ వృక్షం వద్ద మహిళలు పూజలు చేశారు. బోడసకుర్రు తదితర గ్రామాల్లో షష్ఠి తీర్థాలు ఘనంగా జరిగాయి.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన గుత్తెనదీవి శ్రీవల్లీ దేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులు నిర్వహించే షష్ఠి ఉత్సవాలకు ఆలయాన్ని మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాత్రి సమయంలో జరిగే తీర్థమహోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మంగళవారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. బుధవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్ కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకుని పూజించారు. నాలుగు రోజులు ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. మురమళ్ళ ఐ.పోలవరం, కొమరగిరి, తిల్లకుప్ప తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి తీర్థాలు జరిగాయి.

యానాం, (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం ప్రాంగణంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి మహోత్సవంనిర్వహించారు. బుధవారం వేకువజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. పూలు, పడగలు స్వామివారికి సమర్పించి పూజలు నిర్వహించారు. డిల్లీప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ స్వామివారిని దర్శించుకున్నారు .ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఎస్పీ వరదరాజన్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. మొండెపులంకలో ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. అనంతరం తెల్లవారుజామున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూకట్టారు. పి.గన్నవరం, మానేపల్లి, కుందాలపల్లి తదితర గ్రామాల్లో స్వామివారి కల్యాణాలు, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి.

సీఎంను కలిసిన టీడీపీ ఇన్‌చార్జి అమూల్య



రాజోలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉండవల్లి నివాసంలో బుధవారం టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అమూల్య కేడర్ విత్ లీడర్ కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల్లోని కొన్ని సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. సంస్థాగతంగా నియోజకవర్గంలోని పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్టు పేర్కొన్నారు. వాటిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆమె చేస్తున్న పార్టీ కార్యక్రమాలను అభినందించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సూపర్-6 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సీఎం చంద్రబాబు తనకు సూచించారని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా షష్ఠి వేడుకలు

రాజోలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజోలు మండలంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూలు, పడగలు సమర్పించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కడలిలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రధాన ఆలయ అర్చకులు కాకాని వెంకటసత్యకృష్ణకుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మాజీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు, ప్రముఖ న్యాయవాది యాలంగి రమేష్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో టి.నాగవిష్ణు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా టీవీ నరేష్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రాజేష్‌కు జాతీయ అవార్డు



పి.గన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని ఏపీ భవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో అంబేడ్కర్ -పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-మహాత్మా జ్యోతిబా పూలే జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. పి.గన్నవరానికి గ్రామానికి చెందిన సహృదయ ఫౌండేషన్ చైర్మన్ పైడి రాజేష్‌కు సామాజిక సేవలకు గుర్తింపుగా జాతీయ అవార్డు అందించారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల శాఖ మంత్రి జీతన్‌రామ్‌మాంఝీ నుంచి ఆయన అవార్డు అందుకున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కిసాన్‌మోర్చా నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అమలాపురం కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా నాయకుడు కొప్పుల సత్తిబాబు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, కాంగ్రెస్ కిసాన్‌శాఖ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక రైతు, వ్యవసాయ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని విమర్శించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ అఖిలేష్, నేషనల్ కిసాన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్లు డీకే స్వామి, పి.బాబు, వివిధ పార్టీల, సంఘాలనాయకులు అల్లూరి మధురాజు, జంగా గౌతమ్, కొత్తూరి శ్రీనివాస్, పీతల రామచంద్రరావు, ఎస్తేరు రాణి, అయితాబత్తుల సుభాషిణి, తోటే ప్రతాప్, దైవకృప, రాయడు గంగాభవానీ పాల్గొన్నారు.

కుండలేశ్వరునికి కేంద్ర మంత్రి సతీమణి పూజలు

కాట్రేనికోన, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసాపురం ఎంపీ, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సతీమణి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సూర్యవెంకటదుర్గ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో అర్చకుడు కామేశ్వరరావు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, కనకదుర్గ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, మోటుమర్రి ఉదయభాస్కరరావు, గంగుమళ్ళ నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన పి.కామేశ్వరిమాధవ్- సవిత దంపతులు, నవదీప్‌జోషి దంపతులు రూ.20,116 విరాళంగా అందించారు. విరాళం అందించిన దాతలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. బుధవారం స్వామివారిని 3800మంది భక్తులు దర్శించున్నారు. 1700మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1.76లక్షలు ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.


పైప్ లైన్ లీకేజీ ఘటనలో అందరికీ పరిహారం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్లపల్లి

యానాం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గం దరియాలతిప్ప గ్రామాన్ని ఆనుకుని గోదావరిలో జరిగిన ఓఎన్జీసీ పైప్‌లైన్ లీకేజీకి సంబంధించి నష్ట పరిహారంపై అసత్య ప్రచారాలు నమ్మవద్దని, అందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. బుధవారం తన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దరియాలతిప్పలో నాలుగు గ్రామాల ప్రజలు 42రోజులు ఆందోళన చేస్తున్నారని, ఈఅంశం తీవ్ర రూపందాల్చ కుండా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరిన మేరకు పుదుచ్చేరి నుంచి కలెక్టర్‌ను యానాం పంపారన్నారు. అనంతరం కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం జరిగిందన్నారు. ముఖ్యంగా మత్స్యసంపద నశించిపోతుందనే అంశంపై సైంటిఫిక్ నివేదికపై చర్చించామన్నారు. పైప్‌లైన్ లీకేజీతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఓఎన్జీసీ, రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో కూడా సమావేశం నిర్వహించి పరిహారం చెల్లించాలని కోరామన్నారు. మత్స్యకారులకు ఏవిధంగా న్యాయం జరుగుతుందో, మిగిలిన నాలుగు గ్రామాల ప్రజలకు, యానాం ప్రజలకు అదేవిధంగా న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. రెండు రోజుల్లో పుదుచ్చేరి వెళ్లి గవర్నర్‌ను కలిసి మరోసారి విన్నవిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. రాజకీయాలకు అతీతంగా సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టామన్నారు. అపోహలకు, రాజకీయ విభేదాలకు తావివ్వకుండా ప్రజలు సంయమనం పాటించాలని ఎమ్మెల్యే కోరారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



ముమ్మిడివరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జీఎస్‌బీఎన్ రెడ్డి ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ మునేశ్వరరావు అధ్యక్షతన 29వ అవార్డు ప్రదానోత్సవం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి గౌరీశంకర్ హాజరయ్యారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహకం ఇవ్వడం గొప్ప విషయమని ట్రస్టు చైర్మన్ గిడ్డి ప్రభాకరరెడ్డిని అభినందించారు. అనంతరం ఈనెల19న నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ పరిమళ, జేవీఎల్ నరసింహారావు, ఎం.ఆశీర్వాదం, విత్తనాల వరప్రసాద్, బి.మంగాదేవి, గౌరీ, పి.శివనాగరాజు, లక్ష్మీశ్రీనివాసన్ పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, నవంబరు26(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌కు చెందిన నాయర్ నిఖిల్ వెంకటసత్యపావని దంపతులు కుటుంబ సమేతంగా అయినవిల్లి సిద్ధివినాయకస్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.25వేలు విరాళంగా సమర్పించారురు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వచనంచేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

మంత్రి లోకేశ్ నుంచి మెడల్ అందుకున్న విద్యార్థి విఘ్నేష్

అయినవిల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పుష్కర విఘ్నేష్ అమరావతిలో జరిగిన మాక్ అసెంబ్లీలో పాల్గొని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా ప్రశంసా పత్రం, మెడల్‌ను అందుకున్నట్టు పాఠశాల హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పలువురు మంత్రులు కూడా విఘ్నేష్‌ను అభినందించారు. డీఈవో షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ మమ్మీ, కొత్తపేట డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి తదితరులు విద్యార్థిని అభినందించారు.

డిప్యూటీ సీఎం పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం



రాజోలు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కూనవరంలో అసంపూర్తిగా నిలిచిపోయి శివాలయం నిర్మాణానికి తన సొంత నిధులు, దేవదాయ ధర్మాదాయశాఖ నిధులను సమకూర్చి ఏడాదిలోపు పనులు పూర్తిచేసి శివుడి ఆశీస్సులు పొందేలా చర్యలు తీసుకుంటానని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కూనవరం శివాలయం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి బుధవారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో యువకులు పవన్ దృష్టికి తీసుకువెళ్లారు. తన సొంత నిధులతో శివాలయం నిర్మాణానికి సహకరిస్తానని చెప్పడంతో కూనవరం గ్రామస్తుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా కూనవరంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి బుధవారం గ్రామస్తులు పాలాభిషేకం చేశారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం




ద్రాక్షారామలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో రాయవరం మండలం పసలపూడిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు

సుబ్రహ్మణ్యేశ్వరా...నమో నమః

• భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవాలు • ఉదయం నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తజనం • ప్రత్యేక పూజలు, అభిషేకాలు

ద్రాక్షారామ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలోనున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తజనం దర్శించుకుని పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు క్షీరాభిషేకం చేయడంతో పాటు పూలు, పడగలు సమర్పించారు. వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దేవులపల్లి ఫణిరామకృష్ణ యాజ్ఞకత్వంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మండలంలో నరసాపురపుపేట, హసన్‌బాద, వెల్ల, యనమదల తదితర గ్రామాలో సుబ్రహ్మణ్యషష్ఠి వేడుకలు జరిగాయి. హసన్‌బాదలో మంగళవారం రాత్రి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు ఉండి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో జరిపారు. నరసాపురపుపేటలో బుధవారం రాత్రి జరిగిన కల్యాణంలో భక్తజనం పాల్గొన్నారు.

హసన్‌బాదలో కోలాహలంగా రథోత్సవం: మండలంలోని హసన్‌బాదలో సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి రథోత్సవం కోలాహలంగా జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సి.వీరభద్రరావు, ధర్మకర్త సామంచి సత్యనారాయణమూర్తి, ఈవో యాళ్ల వీరవెంకట సత్యనారాయణ, సి.వీరభద్రరావు,సి.చినసోమరాజు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..: పట్టణంలోనున్న అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తజనం స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చెరుకుపల్లి గణేష్‌శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఈవో సీహెచ్‌వీ సత్యనారాయణ పర్యవేక్షణలో షష్ఠి వేడుకలు జరిగాయి. రామచంద్రపురం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పసలపూడి ఆలయంలో...

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపారు. పసలపూడిలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచే అభిషేకాలు, అర్చనలు, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించడంతోపాటు రజిత కవచం అలంకరించారు. సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. రాయవరం పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు విలపర్తి ఫణిధర్‌శర్మ, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వెదురుపాక, లొల్ల, చెల్లూరు , వెంటూరు గ్రామాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో షష్ఠి పూజలు చేశారు. వేకువజాము నుంచే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పసలపూడి గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చింతా నాగ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు మామిడిపల్లి గోపాలకృష్ణ గణేష్‌శర్మ, రామశర్మ అర్చకత్వంలో జరిగిన కార్యక్రమంలో చింతా దేవ సూర్య శివ ప్రసాద్‌రెడ్డి, లీల జయ భారతి దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. అనంతరం కల్యాణం జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు, డాక్టర్ గిరిబాల, అపడాల అబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



కొత్తపేట: వాడపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఆలమూరు మండలంలో షష్ఠి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బుధవారం తెలవారుజాము నుంచే భక్తులు సుబ్రహ్మణ్య ఆలయాలకు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆలమూరు, చెముడులంక, మడికి, జొన్నాడ, చింతలూరు, మోదుకూరు, నర్సిపూడి, పెదపళ్ల, సంధిపూడి, పినపళ్ల, పెనికేరు గ్రామాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులుతీరారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు చెల్లించారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, వల్లూరు, నేలటూరు, కోరుమిల్లి తదితర గ్రామాల్లో భక్తజనం ఆయా ఆలయాల వద్ద బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. నేలటూరు నీలాంబిక సమేత బసవేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠి వేడుకలు నిర్వహించారు. అంగరలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీరామ బాలభక్త భజన సమాజం వారిచే భజన, చిన్నారులతో కూచిపూడి నృత్యం, రాత్రి కొమరిపాలెం వారిచే బాణసంచా కాల్పులు నిర్వహించారు. ఆలయం వద్ద అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అంగర ఎస్‌ఐ హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠిని పురస్కరించుకుని మండలంలోని ఆయా ఆలయాల్లో స్వామివారికి ఉదయం నుంచి పాలాభిషేకం, అష్టోత్తర సహస్ర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారికి పూలు, పడగలు సమర్పించారు.




ప్రత్యేక అలంకరణలో ఆలమూరులోని సుబ్రహ్మణ్యస్వామివారు. పక్క చిత్రంలో రావులపాలెంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆయా ఆలయాల్లో భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండిపుట్టలో భక్తులకు దర్శనమిచ్చారు. వాడపల్లి, పేరవరం, నార్కెడిమిల్లి తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూలు, పడగలు సమర్పించారు. సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు పూజలు

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడపాలెంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మందపల్లి శనేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల నాగేంద్రస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. కొత్తపేట హరిహరదేవాలయంలో గల సుబ్రహ్మణ్యేశ్వరుడిని వందలాది భక్తులు దర్శించుకున్నారు. షష్ఠిని పురస్కరించుకుని వాడపాలెం, కొత్తపేటలలో పెద్దఎత్తున తీర్థాలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బండారు బుల్లితాత, కంఠంశెట్టి శ్రీనివాసరావు, శ్రీకాకోళపు భీమేశ్వరరావు, బండారు భాస్కరరావు, కడియం భాస్కర్, పప్పుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఆయా ప్రాంతాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. యండగండిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. యండగండి, పామర్రు, దంగేరు, కోటిపల్లి తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి

సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు

మండపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గరాణి బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కె.గంగవరం : యండగండిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గెలుపొందిన విజేతలను అభినందిస్తున్న దృశ్యం

ఆలమూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ద్రోణ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. బాలికల జూనియర్స్ గ్రీన్‌బెల్ట్ కత్తి మూమెంట్స్ ఏవిభాగంలో అనుశ్రీకార్తీక ప్రథమస్థానం, నాన్‌చాక్ కటాస్‌లో బండి దైవిక్‌ఆశీస్ ప్రథమస్థానం, ఎల్లో బెల్ట్ టైక్వాండో కటాస్ ప్రథమస్థానం, ఎల్లో బెల్ట్ టైక్వాండో కటాస్ ఎ విభాగంలో పాతూరు సంతోష్‌కుమార్ ప్రథమస్థానం, లంక దినేష్ ద్వితీయస్థానం, బీ విభాగంలో ఎస్‌వీ దుర్గాసాకేత్ ప్రథమస్థానం, బల్లిరెడ్డి ప్రవళిక ద్వితీయస్థానం సాధించినట్లు కోచ్ టి.వెంకటలక్ష్మి తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు అభినందించారు.

న్యాయ అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

రావులపాలెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్ ఆధ్వర్యంలో రావులపాడులో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం బుధవారం ఐదవ రోజుకు చేరుకుంది. ముందుగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. వలంటీర్లు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఐసీటీసీ కౌన్సిలర్ గీతాంజలి, ఎండీ ప్రసాద్ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అల్లు భాస్కర్, డి.బాలప్రతాప్, కె.రాజారావు, పీఎల్‌వీఎన్ కృష్ణ పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు, గ్రామస్థులు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సత్యాదేవి, బాబ్జి, పెచ్చెట్టి చిన్నారావు, జి.శ్రీనివాస్, ఎం.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణకు చెందిన నూరి సూర్యనారాయణ - సత్యవతి దంపతులు రూ.1,00,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు.

వైభవంగా కేశవస్వామి మాస కల్యాణం

ఆత్రేయపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి శ్రవణ నక్షత్ర మాస కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ప్రత్యేక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అశేష భక్తజనం పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం ఆలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

మండపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం అంచనాల కమిటీ సభ్యులతో కలిసి సింహాచలం వరాహనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చైర్మన్, సభ్యులను సత్కరించడంతో పాటు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. చైర్మన్ ఆధ్వర్యంలో అంచనాల కమిటీ సమావేశం నిర్వహించారు.



అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండ

కె.గంగవరం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. బుధవారం ఆయన సుందరపల్లి గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలపై వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, కూటమి నాయకులు తాడాల జానకిరామ్, శీరెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.




మండపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నూకదుర్గారాణి. పక్క చిత్రంలో కపిలేశ్వరపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో భానూజీరావు

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

కపిలేశ్వరపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో హెచ్.భానూజీరావు అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, ఏవో రాజేంద్రప్రసాద్, కార్యదర్శి శివచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ, కొత్తపేట నియోజకవర్గ దినోత్సవాలను ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రాజు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ తదితర నాయకుల చిత్రపటాలకు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో ఎ.రాజు, ఏవో మోహర్ ప్రకాష్, సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్, కూటమి నాయకులు ఈదల నల్లబాబు, ఈదల రాంబాబు, మానేపల్లి శ్రీనివాస్, పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.రాజు, ఎంఈవో ప్రసాదరావు, పరిపాలనాధికారి రామస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం, పట్టణంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ద్రాక్షారామలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆధ్వర్యంలో యానాం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని ఆయా పంచాయతీలు, సచివాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని జరిపారు. రామచంద్రపురం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ, డాక్టర్ ఎస్‌వీ రమణ, రవికుమార్, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. మోడరన్ విద్యా సంస్థల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): మండల తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ ఓటర్లను పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఓటు విలువతో పాటు, ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మురళి, ఆర్ఐ వెంకట్రావు, వీఆర్వోలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమానత్వానికి ప్రతీక

మండపేట (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం సమానత్వానికి, సమ న్యాయానికి ప్రతీక అని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కరాచీ సెంటర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ టౌన్ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసు, ఆర్టీఐ అధ్యక్షుడు మందపల్లి రవికుమార్, వైసీపీ నాయకులు ఎర్రగుంట అయ్యప్ప, ఆలీఖాన్‌బాబా, పోతంశెట్టి ప్రసాద్, జొన్నపల్లి సత్తిబాబు, మారేడుబాక సర్పంచ్ ఎం.గోవిందరాజు, పి.సత్తిబాబు, విప్పర్తి సింహాచలం, ఎం.ఆనందరావు, డి.అబ్రహం, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు అంశాలపై వక్తలు మాట్లాడారు.

భూ సమస్యలు గుర్తించేందుకే గ్రామసభలు

కపిలేశ్వరపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే పూర్తయిన ఆయా గ్రామాల్లో భూసంబంధిత సమస్యలు గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వడ్లమూరు, నిడసనమెట్ట గ్రామాల్లో భూసంబంధిత సమస్యలపై రెవెన్యూ, సర్వే బృందాల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈనెల 26వ తేదీ నుంచి వచ్చేనెల 18 వరకూ వారు అందుబాటులో ఉంటారన్నారు. అన్ని గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు జరుగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామరెవెన్యూ అధికారి షేక్ అబ్దుల్ కరీం, గ్రామ సర్వేయర్లు బి.నాగమహేష్, బి.వివేక్‌వర్మ, ఎం.కృష్ణ కిరణ్, జి.వరలక్ష్మి, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవం

రాయవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీడీవో ఎస్. కీర్తి స్పందన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకట రమణ హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ఏఈ జీఎన్ దాస్, మండల ప్రజా పరిషత్ ఏవో వైఎస్ఎస్ గోపాల్, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

శివాలయం ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ



సుందరపల్లిలో భూమిపూజ అనంతరం కూటమి నాయకులతో వాసంశెట్టి సత్యం

కె.గంగవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. బుధవారం సుందరపల్లి గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ముఖద్వారం నిర్మాణానికి మంత్రి సుభాష్ వైజాగ్ సీఎంఆర్ షాపింగ్ మాల్ వారిని కోరగా, వారు అంగీకరించడంతో ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ చేశారన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ వైజాగ్ మేనేజర్ మల్లెల బాజ్జి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, కూటమి నాయకులు శీరెడ్డి సత్తిబాబు, తాడాల జానకిరామ్, అడపా వెంకటేశ్వరరావు, అడపా సత్తిబాబు, సుంకర ఉదయ్‌కుమార్, సలాది సత్తిబాబు, ఆర్. మణికంఠ, ఎ.బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ఆత్రేయపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం చినపేటలో సంభవించిన అగ్నిప్రమాదంలో పమ్మి శాంతకుమారికి చెందిన తాటాకిల్లు దగ్ధమైన ఘటనలో వారి కుటుంబం నిరాశ్రయులైన సంగతి తెలిసిందే. బుధవారం వైసీపీ నాయకులు మేడపాటి సిద్దార్థరెడ్డి, చిలువూరి రామకృష్ణంరాజు తదితర పార్టీ నేతలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15వేల ఆర్థికసాయంతో పాటు 75 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.

విజ్ఞాన యాత్రలో విద్యార్థుల సందడి

కపిలేశ్వరపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు మండల ప్రజాపరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం విజ్ఞాన విహార యాత్రకు తరలి వెళ్లారు. బొమ్మూరులోని రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం సైన్స్ సెంటర్‌తో పాటు, కేశవరం కోకోకోలా ఫ్యాక్టరీకి వెళ్లి వాటిని పరిశీలించి పలు అంశాలను తెలుసుకున్నారు. పాఠశాల హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో పాటు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేశ్ నుంచి మెడల్ అందుకున్న విద్యార్థి విఘ్నేష్

అయినవిల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి పుష్కర విఘ్నేష్ అమరావతిలో జరిగిన మాక్ అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసా పత్రం, మెడల్‌ను అందుకున్నట్టు పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రులు కూడా విఘ్నేష్‌ను అభినందించారన్నారు.

ఉపముఖ్యమంత్రి పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రాజోలులో కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. ఆయనకు వాడపల్లి వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో పాటు స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాడపల్లి వెంకన్నను దర్శించుకోవాలని ఆయన్ను కోరగా త్వరలో దర్శనానికి వస్తానని తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం వాడపల్లి వెంకన్న ఆలయానికి, ఏటిగట్టు రహదారి నిమిత్తం రూ.6కోట్లు నిధులు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

భగవద్గీత పోటీల్లో విజేతలకు బహుమతులు

ఆలమూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ అధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే భగవద్గీత పోటీలు బుధవారం ఆలమూరు మండలం చెముడులంక నేతాజీ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించారు. భగవద్గీత 12వ అధ్యాయం భక్తియోగంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు దూలం గనిరాజు, వడ్డి దొరయ్యనాయుడు, స్కూల్ అధినేత తుమ్మా శ్రీనివాస్‌ల చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. డిసెంబరు 13న జరిగే జిల్లాస్థాయి భగవద్గీత పోటీలకు నేతాజీ స్కూల్ నుంచి ఏడుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని మండల లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం సబ్‌కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, ఏజెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, ఏజీపీ లకాని పద్మకమల కుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు, కార్యదర్శి బొడ్డు నరసింహమూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

కపిలేశ్వరపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వల్లూరులో నిత్యావసర సరుకుల పంపిణీని తహసీల్దార్ జి.శ్రీనివాస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రేషన్ పంపిణీ ఏవిధంగా జరుగుతోందన్న అంశంపై ఆకస్మిక తనిఖీ చేశామన్నారు. మండలంలో 65 ఏళ్లు పైబడిన వారికి డీలర్ల ద్వారా ఇంటింటికీ డోర్ డెలివరీ చేస్తామన్నారు. డోర్ డెలివరీని పర్యవేక్షించేందుకు ప్రతి దుకాణానికి ఒక్కొక్క సచివాలయ సిబ్బందిని నియమించామని ఆయన తెలిపారు.